epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:36

24 క్యారెట్లు 155,840.00 | కిలో వెండి 2,59,900.00 | chourastha Digitals | 21.09.2026 సోమవారం, హైదరాబాద్



## నేను బహుజనుల బాణాన్ని

కొడంగల్‌లో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

2లో

# శాసన వ్యవస్థకు పరీక్ష



## దానంపై హైకోర్టు వేటుతో సరికొత్త సవాల్

- కథ సుప్రీంకోర్టుకు చేరడంతో మరింత హీట్
- స్పీకర్ నిర్ణయాధికారాలు, న్యాయవ్యవస్థ సమీక్షలపై చర్చ
- కోర్టుల జోక్యానికి అవకాశమిస్తున్న శాసన పరిణామాలు
- ఫిరాయింపు కేసుల్లో కాలపరిమితి ఉండాలంటున్న విశ్లేషకులు
- సుప్రీం విచారణపై రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటు వేయ డం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్నది. బీఆర్ఎస్ టికెట్ పై ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. కాంగ్రెస్‌లో చేరి, అదే పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం చుట్టూ మొదలైన వివాదం.. చివరికి స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడం, ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటిం చడం వరకు వెళ్లింది. ఇప్పుడు హైకోర్టు తీర్పు ను సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ అంశం మరింత ఆసక్తికరంగా మారింది. ప్రపంచ పటాలు పరిశీలించండి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
అయితే, దానం నాగేందర్ అనర్హత ఒక్క ఎమ్మెల్యే పదవికి సంబంధించిన వ్యవహారంగా మాత్రమే కాకుండా.. ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయ పరిమితి, ఆ నిర్ణయంపై కోర్టులు ఏ స్థాయిలో జోక్యం చేసుకోవచ్చు? రాజకీయంగా కీలకమైన కేసుల్లో స్పీకర్ నిష్పాక్షికత ఏమిటి.. అనే అంశాల చుట్టూ పొలిటికల్ హీట్ పెరిగింది. ప్రస్తుతం దానంపై అనర్హత వేటు కంటే స్పీకర్ నిర్ణయంపై న్యాయ సమీక్ష చుట్టూ చర్చ సాగుతున్నది. పదో షెడ్యూల్ ప్రకారం పార్టీ ఫిరాయింపులపై అనర్హతకు సంబంధించి నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉం టుంది. కానీ, దానం కేసులో జరిగిన పరిణామం శాసన వ్యవస్థకు సవాల్‌గా మారింది. స్పీకర్ ఒక నిర్ణయం తీసుకున్నారు..

।మిగతా 2 లో।

## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం



- దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దే...
- ఆ భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం
- విషప్రచారాన్ని నమ్మొద్దు
- అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం
- రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి

"దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పునరుద్ఘాటించారు. పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు.

।మిగతా 2 లో।




## రైతు పాలన పోయి రాక్షస పాలన వచ్చింది

- మూడేండ్ల రేవంత్‌రెడ్డి, పదేండ్ల కేసీఆర్ పాలనపై చర్చకు సిద్ధమా?
- రైతు బంధు ఎగ్గొట్టిన ఘనత సీఎందే
- మాజీ మంత్రి హరీశ్ రావు
- ఆలేరు నియోజకవర్గం మోటకొండూరులో పలువురు టీఆర్ఎస్‌లో చేరిక

2లో

తెలంగాణలో రైతు పాలన పోయి రాక్షస పాలన వచ్చిందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ పాలనను ప్రజలంతా చూశారని, రైతులకు మూడు పంటల రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదేనని విమర్శించారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో**




## 15 నుంచి పెట్రోల్ బంకుల్లో యూపీఐ బంద్

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**
మధ్యప్రదేశ్‌తో పాటు ముంబయి మహానగరంలోని పెట్రోల్ బంకుల్లో వచ్చే అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులను నిలిపివేయనున్నట్టు పెట్రోల్ డీలర్లు హెచ్చరించారు.

।మిగతా 2 లో।

## కేసీఆర్ కుటుంబ అక్రమాలు బయటపెడ్తం


- చెరువులు, అసైన్డ్ భూములు దోచుకున్నారు
- ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్, రేవ్ పార్టీలకు అడ్డాగా మార్చారు
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- అజీజ్‌నగర్, మొయినాబాద్‌లో ఫామ్‌హౌస్‌ల పరిశీలన
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు
- ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,
- మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ యాదవ్



"బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అక్రమంగా వేల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టుకుందని.. వాటి చిట్టాను ప్రజల ముందు ఉంచుతామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అన్నారు. ఫామ్‌హౌస్‌లో సామ్రాజ్యాలు నిర్మించుకున్నారని.. వాటిని డ్రగ్స్, రేవ్ పార్టీలకు అడ్డాలుగా మార్చుకున్నారని ఆరోపించారు. అక్రమంగా దోచుకున్న భూములను స్వాధీనం చేసుకొని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు పంచు తామని చెప్పారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అక్రమంగా వేల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టుకుందని.. వాటి చిట్టాను ప్రజల ముందు ఉంచుతామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అన్నారు. ఫామ్‌హౌస్‌లో సామ్రాజ్యాలు నిర్మించుకున్నారని.. వాటిని డ్రగ్స్, రేవ్ పార్టీలకు

।మిగతా 2 లో।



## భారత్‌లో పెరుగుతున్న వాతావరణ ముప్పు

- మధ్య, వాయవ్య ప్రాంతాల్లో తీవ్ర 'హాట్ స్పాట్లు'
- వేడి, కరువు, ఉక్కపోత, భారీ వర్షా ల
- ప్రభావాలు..ప్రత్యేక వాతావరణ అనుసరణ చర్యలు అవసరం
- తీర ప్రాంతాల నుంచి లోనికి ఉక్కపోత
- దక్షిణ భారత్‌లో కరువు ముప్పు
- శాస్త్రవేత్తలు

2లో

## డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు

- ఇందిరమ్మ ఫ్లాట్ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్
- నేటి నుంచే అలాట్‌మెంట్ లెటర్స్
- అధికారిక వెబ్‌సైట్ నుంచీ డౌన్‌లోడ్
- రూ.50 లక్షల విలువచేసే ఫ్లాట్ రూ.5 లక్షలకే



2లో

## తెలంగాణలో అతి భారీ వర్షాలు

- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- వాతావరణశాఖ



2లో

## ఉసురు తీసిన మూఢనమ్మకం

క్షుద్రపూజలు చేసి చంపుతాడన్న భయంతో వ్యక్తి దారుణ హత్య

- రామనారాయణ నాటు వైద్యం పేరుతో మంత్రాలు చేస్తున్నాడని అనుమానం
- తమ కుటుంబ సభ్యులను చంపేస్తాడన్న భయంతో హత్య
- హత్య వివరాలు వెల్లడిస్తున్న ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు



# శాసన వ్యవస్థకు పరీక్ష



**తరువాయి భాగం**

ఆ నిర్ణయాన్ని హైకోర్టు సమీక్షించింది.. చివరకు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి సభ్యుడిని అనర్హుడిగా ప్రకటించింది. దీంతో స్పీకర్ నిర్ణయాధికారాల పరిధిపై ప్రస్తుతం రాజకీయవర్గాల్లో వాడివేడి చర్చ జరుగుతున్నది. శాసన సభాపతిగా ఎన్నికైనవారు మొత్తం సభకు సంబంధించిన బాధ్యతలు నిర్వహిస్తారు. అయితే, ఫిరాయింపుల కేసుల్లో స్పీకర్ నిర్ణయం నేరుగా రాజకీయ బలాబలాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అధికార పక్షంలో చేరిన ప్రతిపక్ష ఎమ్మెల్యేల విషయంలో ఈ నిర్ణయాలకు రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుంది. అందుకే ప్రతిపక్షాలు తరచూ స్పీకర్ నిర్ణయాలపై అధికారపక్ష ప్రభావం ఉంటోందని ఆరోపణలు చేస్తుంటాయి. దానం కేసులో హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని కొట్టివేసింది. దీంతో స్పీకర్ నిర్ణయాల్లో పారదర్శకత, కారణబద్ధత, కాలపరిమితి, నిష్పాక్షికతపై చర్చను మాత్రం మరింత పెంచింది.

**స్పీకర్ జాప్యం.. కోర్టుల జోక్యం!**

వాస్తవానికి ఫిరాయింపు వ్యవహారంలో స్పీకర్ నిర్ణయం ఆలస్యమైతే కోర్టుల జోక్యానికి అవకాశం పెరుగుతుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలైన తర్వాత.. నిర్ణయాలు ఆలస్యమయ్యాయని పేర్కొంటూ పిటిషనర్లు మొదట హైకోర్టును ఆశ్రయించారు. ఈ వివాదం చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. 2025 జూలైలో సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్ మూడు నెలల్లో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఫిరాయింపు పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడం లో జరిగిన ఆలస్యాన్ని కోర్టు పరిశీలించింది. ఒకవైపు రాజ్యాంగం స్పీకర్‌కు అధికారాన్ని ఇస్తే.. మరోవైపు ఆ అధికారాన్ని వినియోగించడంలో జాప్యం జరిగితే న్యాయస్థానాలు జోక్యం చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. దానం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తుతం శాసన వ్యవస్థకు ప్రశ్నగా మారింది.

**పాలక పక్షానికి సవాల్.. ప్రతిపక్షాలకు ఆయుధం..**

దానం నాగేందర్ వ్యవహారం కాంగ్రెస్‌కు ప్రస్తుతం రాజకీయంగా కూడా సవాల్‌గా తయారైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ బాటపట్టారు. వారిపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని స్పీకర్ దశలవారీగా విచారించి.. తిరస్కరించారు. దానం కేసులో మాత్రం హైకోర్టు ఆ నిర్ణయాన్ని పక్కనపెట్టింది. దీంతో మిగిలిన ఎమ్మెల్యేలపై కూడా ఇదే అంశం మళ్లీ రాజకీయ చర్చకు వచ్చింది. కాంగ్రెస్ నేతలు మాత్రం ఫిరాయింపుల రాజకీయాలపై బీఆర్ఎస్ గత రికార్డును ప్రస్తావిస్తూ తమ వాదనను వినిపిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే.. తర్వాత వారు మరో పార్టీలో చేరడాన్ని ప్రజా తీర్పును విస్మరించడంగా చిత్రీకరిస్తున్నది. అయితే దానం అనర్హత తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే పరిణామం వస్తుందని కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. హైకోర్టు తాజా తీర్పుతో.. ఇప్పటికే స్పీకర్ తిరస్కరించిన మిగితా పిటిషన్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.దానం కేసును బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కూడా హైకోర్టులో సవాల్ చేసింది. వీటిని విచారించిన న్యాయస్థానం స్పీకర్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. దానంపై అనర్హత వేటు వేసింది. ఇప్పుడు దానం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో బీఆర్ఎస్, బీజేపీ రెండూ కేవియెట్లు దాఖలు చేశాయి. దానం పిటిషన్‌పై తమ వాదనలు వినకుండా ఏకపక్ష ఉత్తర్వులు ఇవ్వకూడదన్నది కోరాయి.


**మిగిలిన ఎమ్మెల్యేల సంగతేంది?**

దానం నాగేందర్ కేసు తీర్పు తర్వాత అందరి దృష్టి మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పై పడింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీ లోకి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలపై వివిధ దశల్లో అనర్హత పిటిషన్లు వచ్చాయి. ఇప్పుడు దానం కేసులో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడం, దానంపై అనర్హత వేటు వేయడం తో మిగిలిన కేసులపై ఉత్కంఠ పెరిగింది. మిగిలిన తొమ్మిది మందిలో కడియం శ్రీహరి మినహా ఎనిమిది మంది విషయం లో హైకోర్టు తీర్పు ప్రభావం ఏ విధంగా ఉంటుందనే ఆసక్తికరంగా మారింది.కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత.. ఆయన కూతురు కావ్య కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో కావ్య తరఫున కడియం శ్రీహరి కాంగ్రెస్ కండువా వేసుకుని ప్రచారం చేశారు. ఇది కడియం శ్రీ దీనిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంటే ఆయనపై కూడా అనర్హత వేటు పడొచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**సుప్రీం ఏం చెప్పనుంది?**

తనపై హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీం ఎలా స్పందిస్తుంది? హైకోర్టు తీర్పు కొనసాగుతుందా? ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక జరిగే పరిస్థితి ఏర్పడుతుందా? దానం సభ్యత్వంపై తుది న్యాయ నిర్ణయం ఏమిటి? వంటి అంశాలు పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చకు వస్తున్నాయి. స్పీకర్, శాసన వ్యవస్థలోని నిర్ణయాలపై న్యాయ వ్యవస్థ ఎలా రియాక్ట్ అవుతుందనేదీ కీలకంగా మారింది. ఫిరాయింపుల కేసుల్లో స్పీకర్ నిర్ణయాధికారాలు ముఖ్యంగా చర్చకు వస్తున్నాయి. స్పీకర్ నిర్ణయంలో న్యాయస్థానాలు ఏ మేరకు జోక్యం చేసుకుంటాయి?, ఆ నిర్ణయాల్లో జాప్యం జరిగితే.. కోర్టులు కాలపరిమితి విధింపు వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకునే స్పీకర్ వ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లకుండా, రాజకీయ ప్రభావ ఆరోపణలకు తావివ్వకుండా పిటిషన్లపై తప్పనిసరి కాలపరిమితి ఉండాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శాసన వ్యవస్థలో నిర్ణయాలు పారదర్శకంగా వెలువడకపోతే న్యాయస్థానాల జోక్యానికి అవకాశాలు పెరుగుతాయని వారు అంటున్నారు.

# దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం



**తరువాయి భాగం**

భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూమిలిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.

**భూమిలేని పేదలకు హక్కులు కల్పించాం**

భూమిలేని పేదలకు భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. 'దళితులకు సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' మంత్రి భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని స్పష్టం చేశారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.భూముల రీసర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ... విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.




# 15 నుంచి పెట్రోల్ బంకుల్లో యూపీఐ బంద్

**తరువాయి భాగం**

రూ.2000కు మించిన లావాదేవీలపై విధించిన కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నుంచి ఇంధన విక్రయదారులకు మినహాయింపు ఇవ్వకపోతే ఈ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ ఆఫ్ ముంబయి (పీడీఎం) ఈ అంశంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ), కేంద్ర ఆర్థికశాఖకు లేఖ రాసినట్టు పీడీఎం ప్రతినిధి ఒకరు ఆదివారం తెలిపారు. ఇంధన రిటైలర్లకు ఎండిఆర్ చార్జీలను మినహాయించాలని కోరారు. ఈ చార్జీలను వెనక్కి తీసుకోకపోతే యూపీఐ సదుపాయాన్ని ఉపసంహరించుకుంటామని హెచ్చరించారు. మధ్యప్రదేశ్ పెట్రోల్ పంప్స్ డీలర్స్ అసోసియేషన కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సీఐఏటీ) మధ్యప్రదేశ్ ప్రతినిధి ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 4,700 పెట్రోల్ బంక్‌లపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఒక్కో పెట్రోల్ బంక్‌కు నెలకు సుమారు రూ. 17,700 వరకు అదనపు భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తమ ఇష్టానుసారం నిర్ణయించే అవకాశం డీలర్లకు లేకపోవడంతో ఎండీఆర్ రూపంలో వచ్చే అదనపు ఖర్చును వినియోగదారులపై నేరుగా మోపలేమని ఆపరేటర్లు అంటున్నారు.

# కేసీఆర్ కుటుంబ అక్రమాలు బయటపెడ్తం

**తరువాయి భాగం**

అడ్డాలుగా మార్చుకున్నారని ఆరోపించారు. అక్రమంగా దోచుకున్న భూములను స్వాధీనం చేసుకొని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు పంచుతామని చెప్పారు.



రంగారెడ్డి జిల్లాలోని అజీజ్‌నగర్, మొయినాబాద్ చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు ఫామ్‌హౌస్‌లు, వివాదాస్పద భూములను ఆదివారం కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరు వెంకట్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, నవీన్ యాదవ్ పరిశీలించారు.

**అఫిడవిట్లలో లేవు: చామల**

తెలంగాణ ఉద్యమ సమయంలో సాధారణ జీవితం గడిపిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు వందల ఎకరాలకు యజమానులుగా ఎలా మారారో ప్రజలకు వివరించేందుకే ఈ క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. నిజాం రాజులు తమ 200 ఏళ్ల పాలనలో సంపాదించిన దానికంటే ఎక్కువగా కేసీఆర్ కుటుంబం పదేండ్ల అధికారంలోనే సంపాదించిందని దుయ్యబట్టారు. ఒకవైపు రాష్ట్రం రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోతే, కేసీఆర్ కుటుంబానికి మాత్రం వందల, వేల ఎకరాల ఆస్తులు ఎలా వచ్చాయి? అని ఆయన నిలదీశారు.తెలంగాణ రాజకీయాలు

"సిద్దిపేటలోని హరీశ్‌రావు ఫామ్‌హౌస్, జన్వాడలోని కేటీఆర్ ఫామ్‌హౌస్‌తో పాటు తాజాగా అజీజ్ నగర్ భూములను పరిశీలించాం. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్‌కు ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ లేదు. 2009లో కేటీఆర్ తొలిసారి పోటీ చేసినప్పుడు జన్వాడ ఫామ్‌హౌస్ ప్రస్తావనే లేదు. ఉద్యమ సమయంలో రబ్బరు చెప్పులతో తిరిగిన హరీశ్‌రావుకు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఇరిగేషన్ మంత్రిగా ప్రాజెక్టు కట్టి, దానికి సమీపంలోనే సొంతంగా ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్లతోనే ఈ భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అజీజ్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 76లోని భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని, అక్కడ నిబంధనలకు విరుద్ధంగా జీవో 111ను ఉల్లంఘించి భారీ ఫామ్‌హౌస్, అక్రమ నిర్మాణాలు ఎలా చేపట్టారని ఆయన ప్రశ్నించారు. హరీశ్‌రావు ఫామ్‌హౌస్ భూములను స్వాధీనం చేసుకుని దళితులు, తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ నుంచే గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు నాటకం నడిచిందని, మునుగోడు ఉప ఎన్నికల ముందు నలుగురు ఎమ్మెల్యేలను ఇక్కడి నుంచే తీసుకెళ్లారని ఎంపీ చామల ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్, రేవ్ పార్టీల స్థావరాలుగా మార్చేశారని ఆయన విమర్శించారు.

**ఆ భూములు అమరుల కుటుంబాలకు: అద్దంకి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకులు ఆక్రమించిన అక్రమ భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు పంచాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. "గత పదేండ్ల పాలనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వేల ఎకరాల భూములను దోచుకుని దాచుకున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఏమాత్రం కక్ష సాధింపు చర్యలు కావు.

బీఆర్ఎస్ నేతలు పదేండ్లలో దోచుకున్న సొమ్మును, అక్రమాలను ప్రజల ముందర బటబయలు చేసేందుకే గత మూడు రోజులుగా ఫామ్‌హౌస్ పరిధిలోని భూముల పర్యటనను చేపట్టాం" అని ఆయన స్పష్టం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, వారి అనుచరులు అధికార దుర్వినియోగానికి పాల్పడి వేలాది ఎకరాల ప్రభుత్వ, చెరువులు, అసైన్డ్ భూములను దోచుకున్నారని ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. వీటన్నింటినీ ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు.



# రైతు పాలన పోయి రాక్షస పాలన వచ్చింది


**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

తెలంగాణలో రైతు పాలన పోయి రాక్షస పాలన వచ్చిందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ పాలనను ప్రజలంతా చూశారని, రైతులకు మూడు పంటల రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదేనని విమర్శించారు. మూడేండ్ల రేవంత్ రెడ్డి పాలనపై, పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై విచారణకు తాము సిద్ధమని, రేవంత్ రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పి దేవుడిని సైతం మోసం చేశారని తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం మోటకొండూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు జరిగాయి. ముందుగా వంగపల్లి నుంచి భారీ బైక్ ర్యాలీతో మోటకొండూరు మండల కేంద్రానికి వచ్చారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మోటకొండూరు మండల సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు సిరబోయిన మల్లేష్ యాదవ్, అనంతుల శోభన్ రెడ్డి, మెట్టు పద్మారెడ్డితో పాటు సుమారు 1000 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తన్నీరు హరీశ్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు తక్కువ పంట దిగుబడులు, యూరియా కొరత, మోటార్లు లో వోల్టేజీతో కాలిపోవడం వంటి సమస్యలు దురవుతున్నాయని తెలిపారు. డీఏపీ ధర పెంచారని, రైతు బీమా పరిస్థితి ఏమిటో తెలియడం లేదని ఆరోపించారు.

రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం ఇష్టం లేకనే కోతలు పెడుతున్నారని అన్నారు. ఏఎంఆర్, ఎస్ఎల్బీసీ మోటర్లు నడవకపోవడంతో సాగునీరందడం లేదన్నారు. ప్రశ్నిస్తే కేసులు, జైలుకు పంపుతున్నారని, సోషల్ మీడియాలో కూడా మాట్లాడలేని పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఆలేరు ఎమ్మెల్యేపై భూకుంభకోణాల ఆరోపణలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్ల ప్రభుత్వంగా మారిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్య గౌడ్, పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, డీసీసీబీ మాజీ చైర్మెన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి, నల్లగొండ జిల్లా జెడ్పీ మాజీ చైర్మెన్ బండా నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మదర్ డెయిరీ మాజీ చైర్మెన్ లింగాల శ్రీకర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, బీఆర్ఎస్ నాయకులు కల్లూరి రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉసురు తీసిన మూఢనమ్మకం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**



అతను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ ఆదివాసీ. బతుకుదెరువు కోసం వలస వచ్చాడు. చెప్పుకోవడానికి నా అనేవారు ఎవరూ లేరు. పరిచయమైన వారితోనే స్నేహం చేస్తూ, వారి వద్దే దొరికిన పని చేసుకుంటూ జీవనం గడిపేవాడు. ఉన్నదాంతోనే కాలం వెళ్లదీయక ఆ వ్యక్తి లేనిపోని ప్రగల్భాలు పలికాడు. 'నాకు క్షుద్రపూజలు వచ్చు నన్ను ఏమైనా అంటే మీ అంతు చూస్తా' అంటూ తనతో వైరం పెట్టుకున్నవారినల్లా బెదిరించాడు. అదే అతని మరణానికి కారణమైంది. ఆ మాటలు నిజమేనని నమ్మిన మరో వ్యక్తి తమకు ఏ హాని తలపెడతాడో అన్న భయంతో కత్తితో దాడి చేసి చంపాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిలో ఓ వ్యక్తిని దారుణంగా చంపినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. మృతుడు ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీ తెగకు చెందిన పూనెం రామనారాయణగా గుర్తించారు. గత రెండున్నరేళ్లుగా రామనారాయణకు కొమరం రామనాథం ఆశ్రయం ఇచ్చాడన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు, రామనాథాన్ని అదుపులోకి తీసుకొని విచారణ జరపగా నేరం అంగీకరించాడు.రామనారాయణ నాలుగేళ్లుగా వ్యవసాయ పనులు చేస్తూ సుద్దరేవు గ్రామంలో నివాసముంటున్నాడు. అతనికి కొమరం రామనాథం అనే వ్యక్తి ఆశ్రయమిచ్చాడు. రామనారాయణకు కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి మంత్రాలు, పూజలతో నయం చేస్తానంటూ మాయమాటలు చెప్పి అడపాదడపా సంపాదించుకునేవాడు.

కొమరం రామనాథం ఇంట్లో ఉండేవారని, రామనారాయణ నాటు వైద్యం అంటూ క్షుద్ర పూజలు చేసేవాడని సమాచారం. మృతుడుకి మద్యం సేవించే అలవాటు ఉండటంతో అప్పుడప్పుడు రామనాథంతో గొడవ పడుతూ ఉండేవాడు. ఓ సారి ఇంటికి వచ్చిన రామనాథం చిన్న కుమారుడు రజనీకాంత్ అతని వైఖరి నచ్చక గొడవపడి అతన్ని ఇంట్లో నుంచి గెంటేశాడు.

**ఎప్పటికైనా ముప్పేనని భావించి హత్య**

ఈ ఘటన జరిగిన వారం రోజుల్లోనే రామనాథం ఇంట్లో పెంపుడు కుక్క చనిపోయింది. వెళ్లేటప్పుడు రామనారాయణ కుక్కవైపు చూస్తూ వెళ్లిన దృశ్యాలు అతనికి గుర్తుకొచ్చాయి. మంత్రాలతోనే రామనారాయణ ఏమో చేసి ఉంటాడని రామనాథం నమ్మాడు. అతనికి భయపడి తిరిగి ఇంట్లోకి రానిచ్చాడు. ఓ సారి మద్యం మత్తులో ఉన్న రామనారాయణ 'నా జోలికొస్తే చిన్న కుమారుడిని, మనమరాలిని మంత్రాలతో చంపేస్తాను' అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన రామనాథం అతని వల్ల తన కుటుంబానికి ఎప్పటికైనా ముప్పు తప్పదని గ్రహించాడు. మద్యానికి అలవాటు పడ్డ రామనారాయణ లేనిపోని గొప్పలకు పోయి కోరి మరీ కొరివి తెచ్చుకున్నాడు. జాలిపడి ఆశ్రయమిస్తే మత్తులో వారినే బెదిరించి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. మంత్రాలకు చింతకాయలు రాలవు అన్న వాస్తవాన్ని మూఢనమ్మకంతో మరిచిపోయిన రామనాథం అతణ్ని చంపి జైలు పాలైయ్యాడు.

# నేను బహుజనుల బాణాన్ని

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్నికాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ .."నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేద్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు.ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే కోడంగల్ వచ్చానని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, రాష్ట్రంలో విద్యా బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.





## ప్రొఫెసర్స్ కాలనీలో భక్తిశ్రద్ధలతో
# అన్నదాన కార్యక్రమం

**హనుమకొండ , తెలంగాణ చౌరస్తా:**

హనుమకొండ ప్రొఫెసర్స్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం భక్తి భావంతో అన్నదాన వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 250 మంది భక్తులకు రుచికరమైన భోజనాలను ఏర్పాటు చేసి అన్న ప్రసాదం అందజేశారు.భక్తులందరూ వినాయక స్వామి ఆశీస్సులు పొంది,ఆనందోత్సాహాలతో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమానికి సాయిని గార్డెన్స్ అధినేత డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు,ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మొదటి డివిజన్ అధ్యక్షులు పాపిశెట్టి శ్రీధర్,హాసన్ పర్తి మండల టీఆర్ఎస్ అధ్యక్షులు బండి రజనీకర్,ప్రొఫెసర్స్ కాలనీ అధ్యక్షులు రమణయ్య,అభిరామ్ అపార్ట్మెంట్ అధ్యక్షులు డాక్టర్ పొన్నాల రామయ్య,ఫార్చ్యూన్ రెసిడెన్సీ అధ్యక్షులు బొక్క కుమార్,దేశిని శ్రీధర్ గౌడ్,రేణా ఈశ్వర్,జనగాని శివకుమార్ గౌడ్,కేసిపెద్ది మహేందర్ రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ....అన్నదానం మహాదానం - అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పేర్కొన్నారు.దేవుని సన్నిధిలో ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం అత్యున్నత సేవ అని,భారతీయ సంస్కృతిలో అన్నదానానికి విశిష్ట స్థానం ఉందని తెలిపారు.ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం కాలనీ సభ్యుల ఐక్యతకు,సేవా భావానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు.ప్రొఫెసర్స్ కాలనీ కుటుంబ సభ్యులందరూ భక్తి శ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు."అన్నం పెట్టిన చేయి ఎప్పుడూ ఖాళీగా ఉండదు...సేవ చేసిన హృదయం ఎల్లప్పుడూ దైవానుగ్రహాన్ని పొందుతుంది”అనే భావంతో ఈ కార్యక్రమం భక్తి,సేవా స్ఫూర్తి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# ఎదురుగడ్డలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

- పేదలకు ఉచితంగా రక్త, కంటి పరీక్షలు, వ్యాక్సిన్లు, మందుల పంపిణీ
- ఎదురుగడ్డ గ్రామ సర్పంచ్ బట్టు అరుణ్ నాయక్, సంధ్య
- వైరా ఎమ్మెల్యే తనయుడు మాలోత్ విగ్నేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరు





**లక్ష్మీదేవిపల్లి, భద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. జంగాల రాజేశ్వర్‌రావు ‘సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్’, సాయిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో, గ్రామ సర్పంచ్ బట్టు అరుణ్ నాయక్ సంధ్య దంపతుల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తనయుడు మాలోత్ విగ్నేష్ నాయక్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిరామ్ హాస్పిటల్స్ ప్రముఖ వైద్యులు డాక్టర్ స్వాతి జంగాల, డాక్టర్ సునీల్ కుమార్ జంగాల నేతృత్వంలో వైద్య బృందం గ్రామస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు, వ్యాక్సిన్లు, అసిడిటీ కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిరుపేదలకు ఉచితంగా మెడికల్ టాబ్లెట్లు, సిరప్‌లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అరుణ్ నాయక్ మాట్లాడుతూ "గ్రామస్తులందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి తదుపరి మెరుగైన వైద్యం అందేలా తన వంతు పూర్తి సహకారం అందిస్తాను" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, వివిధ వార్డుల వార్డు మెంబర్లు, హాస్పిటల్ సిబ్బంది గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



# గణపతి మండపాలను సందర్శించిన తుప్పత్ ఆనంద్

- వినాయకుడితోపాటు వీరశివాజీ,
- బాల గంగాధర్ తిలక్ లకు పూజలు
- సనాతన ధర్మం, మన సాంస్కృతి, సాంప్రదాయాలకు యువత పెద్దపీట
- మండపం నిర్వాహకులను అభినందించిన తుప్పత్ ఆనంద్

**బోడుప్పల్, తెలంగాణ చౌరస్తా :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్లో ఆరవ రోజు గణపతి పూజలు ఘనంగా నిర్వహించారు.సి సి ఎం బి కాలనీ, ఎం ఎల్ కాలనీ, ఎస్ ఎస్ ఎన్ సి కాలనీ, భీం రెడ్డి కాలనీ గణపతి మండపాలను బిజెపి నాయకులు తుప్పత్ ఆనంద్ఉమాదేవి దంపతులు దర్శించి ఆ గణనాథుని దీవెనలను అందుకున్నారు. ఒక్కొక గణపతి ఒక ప్రత్యేకతతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఎంఎల్ కాలనీలో పసుపుతో చేసిన గణపతి భక్తులను ఆకర్షిస్తుంది, ఎస్ ఎస్ ఎన్ సి కాలనీ లో యువకులు ఏర్పాటుచేసిన మండపంలో వినాయక విగ్రహంతో పాటు వీర శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం, శివాజీ కూడా పూజలు అందుకోవడం విశేషం, సి సి ఎం బి కాలనీ మండపంలో నిర్వాహకులు బాల గంగాధర్ తిలక్, వీర శివాజీ చిత్ర పాటలను ఏర్పాటు చేసారు. బీమ్ రెడ్డి నగర్లో 15 అడుగుల 6 హస్తాల గణపతి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. ఈ మండపాలను సందర్శించిన తుప్పత్ ఆనంద్ మాట్లాడుతూ ఆయా కాలనీలలో యువకులు ప్రతిఏటా ఉగాది పండుగనుండే వినాయక విగ్రహ నమూనా, తయారీ పనులు ప్రారంభించడం, అంతేకాకుండా వినాయకుడి విగ్రహంతో శివాజీ మహారాజు లాంటి వీరులకు పూజలు చేయడం, సనాతన ధర్మం, మన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విష్ణు, ఉపాధ్యక్షులు శంకర్, సంపత్, నాగరాజు, సురేందర్, పాండు, ప్రవీణ్, రమేష్, నవీన్, మనోజ్ రామకృష్ణ, రాజిరెడ్డి,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు



# దళిత జర్నలిస్ట్ ఫోరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ నియామకం

- తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్
- జిల్లా అధ్యక్షుడిగా తాళ్ల వినోద్ బాబు
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొల్లపల్లి రిషి, జనరల్ సెక్రటరీగా అరుణ్ తేజ
- అక్టోబర్ 7న 'చలో సంగారెడ్డి' మహాసభలను జయప్రదం చెయ్యండి

**భద్రాద్రి కొత్తగూడెం,బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని హెడ్ ఆఫీస్ సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం దళిత జర్నలిస్ట్ ఫోరం జిల్లా నూతన కమిటీ నియామక సమావేశం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ ఆదేశాల మేరకు సీనియర్ జర్నలిస్ట్ భూపేష్ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్న కుమార్ నూతన జిల్లా కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించి, బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు. నూతన జిల్లా కార్యవర్గం వివరాలు:
జిల్లా గౌరవ అధ్యక్షుడు: నరసింహారావు (నేటి ధాత్రి, చర్ల)జిల్లా అధ్యక్షుడు: తాళ్ల వినోద్ బాబు (మీడియా టుడే, కొత్తగూడెం)జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్: గొల్లపల్లి రిషి (తెలంగాణ చౌరస్తా, లక్ష్మిదేవిపల్లి)జనరల్ సెక్రటరీ: గోరెముచ్చు అరుణ్ తేజ (ఏఎస్ఎన్ 24 న్యూస్, చుంచుపల్లి)కోశాధికారి: బరిగల భూపేష్ కుమార్ (జూమ్ ఇన్ వన్, కొత్తగూడెం)జిల్లా ఉపాధ్యక్షులు: కెసుపాక మహేష్ (ప్రభా న్యూస్, బూర్గంపాడు), రాయల పోలయ్య (నమస్తే ఇందూర్, అశ్వరావుపేట), జిల్లా ఉపాధ్యక్షులు గా నక్క వాసు (మీడియా టుడే, మణుగూరు)జిల్లా ఉపాధ్యక్షులుగా రమేష్ పాల్వంచ దిశ, జిల్లా సహాయ కార్యదర్శులు: కంచు శ్రీనివాస్ (రుద్రంపూర్), మంద రష్మిక (నలు దిక్కులు)చుంచుపల్లి మండల అధ్యక్షుడు: మంద శ్రీను (సుజాతనగర్)

**దళిత జర్నలిస్టులకు ₹12 లక్షల ఆర్థిక సాయం అందించాలి:**

ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ మాట్లాడుతూ.. అక్టోబర్ 7వ తేదీన సంగారెడ్డి జిల్లాలో దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ ఆవిర్భావ దినోత్సవ మహాసభలు ఘనంగా జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి దళిత జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి 'చలో సంగారెడ్డి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి దళిత జర్నలిస్టుకు మొదటి విడతలోనే ₹12 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆవిర్భావ మహాసభకు విచ్చేసే రాష్ట్ర మంత్రులకు ప్రత్యేక వినతిపత్రం అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు సీనియర్ జర్నలిస్టులు, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో గణపతికి ప్రత్యేక పూజలు

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా:**


హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లి గ్రామ పద్మశాలి సేవా సంఘం ఆవరణలో కొలువై ఉన్న గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ తిరుమల దంపతులు.ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ మాట్లాడుతూ.... పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో గత దశాబ్ద కాలంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు చాలా ఘనంగా జరుపుకుంటున్నామని,చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తు ఆ గణనాధుని కృపాకటాక్షాలు ఎల్లవేళలా గ్రామ ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మ శాలి సంఘం అధ్యక్షుడు సుంకెనపల్లి శ్రీనివాస్,గౌరవ అధ్యక్షుడు డా.సంగెం ఐలయ్య, ఉపాధ్యక్షులు తలకొక్కుల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి తలకొక్కుల రమేష్, విగ్రహ దాత జడల మోహన్ కుమార్ దంపతులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**


తొర్రూరు మండలం గుర్తూరుకు చెందిన జర్నలిస్టు పెందోట కిషన్ చారి తండ్రి లింగాచారి ఇటీవల మృతి చెందగా, ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి తొర్రూరు ప్రాంత జర్నలిస్టు మిత్రులు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ రూ.11,500 ఆర్థిక సహాయాన్ని కిషన్ చారి కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవడం జర్నలిస్టు కుటుంబాల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. లింగాచారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కిషన్ చారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.భవిష్యత్తులో కూడా అవసరమైన సమయంలో జర్నలిస్టు మిత్రులంతా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సామాజికవేత్తలు జాటోత్ సాయి కృష్ణ,హరికిషన్, జర్నలిస్టులు చౌడవరపు రాము, కొండం అశోక్ రెడ్డి,గజ్జెల వినోద్ రెడ్డి,కొమ్మనబోయిన యాకన్న,మహమ్మద్ అమీర్,వెల్తూరి పూర్ణ రామచందర్,కొమ్ము దేవేందర్,కుక్కల కృష్ణ , నల్లపు రాజు,జగదీష్, మురళి,సర్వి నాగరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

మండలంలోని ఖానాపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ డీఈ ఎన్. కృష్ణ తెలిపారు.సబ్ స్టేషన్ లో 5 ఎంవీఏ ట్రాన్స్ఫార్మర్ స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన 8 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని కారణంగా నేడు (సోమవారం) ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందన్నారు. ఖానాపురం,అమ్మాపురం, గుర్తూరు, సోమారం, జమస్థాన్ పురం, జీకే తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అసౌకర్యం కలుగుతుందన్నారు. నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.



# వినాయక మండపాలను సందర్శన

- మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి
- కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

**మేడిపల్లి, తెలంగాణ చౌరస్తా:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లోని పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ లలో పలు వినాయక మండపాలను సందర్శించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి గణపతికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విహారిక కాలని లో అరికట్ల రమాదేవి రామాంజనేయ రెడ్డి కుటుంబం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం ను ప్రారంభించి, భక్తులకు అన్న వితరణ చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ మహేష్, ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్,కాలనీ అధ్యక్షాకార్యదర్శులు,ఉత్సవ కమిటీ సభ్యులు,నాయకులు,కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు, తదితరులు భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదలు స్వీకరించారు.

# వినాయక నగర్‌లో అన్నప్రసాద వితరణ

**తెలంగాణ చౌరస్తా,రామగుండం:**

రామగుండం వినాయక నగర్ 3వ డివిజన్‌లో శ్రీ గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామగుండం మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్ వద్దూరి రవి పాల్గొన్నారు. విగ్రహ దాత సుద్దాల వకుల కాగా, అన్నప్రసాదానికి వినాయక నగర్ కాలనీవాసులు అందరూ దాతలుగా సహకరించారు. వినాయక నగర్ అధ్యక్షులు చేపూరి నరేంద్ర కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



# దుస్తులు పంపిణీ

**తెలంగాణ చౌరస్తా,హైదరాబాద్ :**

రోడ్ల పక్కన ఫుట్పాత్ల మీద జీవనం సాగించే నిరాశ్రయులు, అనాథలకు దుస్తులు అందించి ఆహారంగా బిస్కెట్ ప్యాకెట్స్, అరటిపండ్లు, నీళ్ల ప్యాకెట్స్ ను స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని తదితరులు పాల్గొన్నారు.





# భారత్‌లో పెరుగుతున్న వాతావరణ ముప్పు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

వాతావరణ మార్పుల ప్రభావంతో భారత్‌లో తీవ్ర పరిస్థితులు కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. మధ్య, వాయవ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడి ప్రభావిత భూభాగం ఏకంగా 40 శాతం వరకు పెరిగింది. దక్షిణ భారత్‌లో కరువు ముప్పు, తీర ప్రాంతాల నుంచి లోనికి విస్తరిస్తున్న ప్రమాదకర ఉక్కపోత, ఈశాన్య భారతంలో కుండపోత వర్షాలు దేశవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులకు సంకేతాలుగా నిలుస్తున్నాయి.భరత్ లో వాతావరణ మార్పుల ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాలు తీవ్రమైన వేడిని ఎదుర్కొంటుండగా, మరికొన్ని కరువు, ప్రమాదకర ఉక్కపోత, భారీ వర్షాలతో సతమతమవుతున్నాయి. మధ్య, వాయవ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వేడి పరిస్థితులు ఎదుర్కొంటున్న భూభాగం 40 శాతం వరకు పెరిగినట్టు తాజా అధ్యయనం వెల్లడించింది. 1971 నుంచి 2022 వరకు నమోదైన ఉష్ణోగ్రతలు, వర్షపాత వివరాలను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, భారీ వర్షాలు, వరుసగా వర్షాలు కురవని రోజులు, కరువు, తేమ, అధిక వేడి వంటి ఏడు సూచికలను కలిపి 'క్లైమేట్ ఇండెక్స్'ను రూపొందించారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో తీవ్ర వాతావరణ పరిస్థితులు ఎలా మారుతున్నాయో గుర్తించేందుకు ఈ సూచికను ఉపయోగించారు. అధ్యయనానికి వాతావరణ శాస్త్రవేత్త, కేంద్ర భూ విజ్ఞానశాస్త్రాల శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ నేతృత్వం వహించారు. నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్‌కు చెందిన శాస్త్రవేత్త తోట మోహన్ ప్రధాన రచయితగా ఉన్నారు. పరిశోధన వివరాలు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్లైమటాలజీలో ప్రచురితమయ్యాయి.




**తీర ప్రాంతాల నుంచి లోనికి ఉక్కపోత**

అధిక ఉష్ణోగ్రత, తేమ కలిసినప్పుడు ఏర్పడే ప్రమాదకర ఉక్కపోత ముప్పు కూడా విస్తరిస్తోంది. అధిక తేమ కారణంగా శరీరం చెమట ద్వారా వేడిని సమర్థంగా బయటకు పంపుకోలేకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. గత ఐదు దశాబ్దాల్లో ప్రమాదకర ఉక్కపోత ప్రభావిత ప్రాంతాలు తీర ప్రాంతాల నుంచి దేశంలోని అంతర్భాగాలకు విస్తరించాయని అధ్యయనం వెల్లడించింది. ఈ ప్రాంతం సుమారు పది శాతం పెరిగినట్టు పరిశోధకులు తెలిపారు.

**దక్షిణ భారత్‌లో కరువు ముప్పు**

దక్షిణ భారతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి. వర్షపాతం తగ్గడం, పట్టణాల్లో ఏర్పడే హీట్ ఐలాండ్ ప్రభావం, ఇతర వాతావరణ సంబంధిత అంశాలు వేడి తీవ్రతను పెంచుతున్నాయని శాస్త్ర వేత్తలు అభిప్రాయపడ్డారు. తూర్పు తీర ప్రాంతాలు, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాలు వేగంగా పొడిబారుతున్నట్టు అధ్యయనం గుర్తించింది. ఒడిశా, ఏపీ, తమిళ నాడులో కరువు ప్రభావిత ప్రాంతాలు నిరంతర సమస్యగా మారుతున్నాయని పరిశోధకులు వివరించారు.

**ఈశాన్యంలో భారీ వర్షా లు**

ఈశాన్య భారత్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒకే రోజులో కురిసే భారీ వర్షాల తీవ్రత పెరుగుతోంది. అదే సమయంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతుండటంతో చల్లని రాత్రుల సంఖ్య తగ్గుతోంది. ప్రాంతీయ ఉష్ణోగ్రతల పెరుగుదలతో పాటు అడవుల నుంచి లభించే సహజ శీతలీకరణ ప్రభావం తగ్గడం కూడా దీనికి కారణమై ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

**ప్రాంతాల వారీగా చర్యలు అవసరం**

ప్రస్తుతం వాతావరణ మార్పులపై జరుగుతున్న అనేక అధ్యయనాలు ఒక్కో తీవ్ర వాతావరణ పరిస్థితిని విడివిడిగా పరిశీలిస్తున్నాయని పరిశోధకులు తెలిపారు. అయితే ఏడు రకాల తీవ్ర వాతావరణ సూచికలను కలిపి రూపొందించిన ఈ కొత్త సూచిక ద్వారా వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చని తోట మోహన్ వివరించారు. వాతావరణ ముప్పులు ప్రాంతానికో విధంగా మారుతున్న నేపథ్యంలో అనుసరణ చర్యలు కూడా స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉండాలని మాధవన్ రాజీవన్ సూచించారు. వాయవ్య భారతంలో వేడి, పట్టణ ఉష్ణ ప్రభావాలపై దృష్టి పెట్టాల్సి ఉండగా, దక్షిణ భారత్‌లో కరువు నివారణ చర్యలు అవసరమని వివరించారు. ఈశాన్య భారత్‌లో భారీ వర్షాలు, వరదల ముప్పును ఎదుర్కొనే ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు స్పష్టం చేశారు.

**వాయవ్య భారతంలో అధిక వేడి**

వాయవ్య భారతంలో తీవ్ర వేడి పెరుగుదల అత్యంత స్పష్టంగా కనిపించినట్టు పరిశోధకులు తెలిపారు. భూమి ఉపరితలంపై అధిక వేడి, నేలలో తేమ తగ్గడం, పొడి వాతావరణ పరిస్థితులు దీనికి దోహదం చేస్తున్నాయని వివరించారు. వేడి, కరువు ప్రభావిత ప్రాంతాలు గతంలో చిన్నచిన్న ప్రాంతాలుగా ఉండగా, ప్రస్తుతం అవి విస్తరించి పరస్పరం అనుసంధానమైన పెద్ద ప్రాంతాలుగా మారుతున్నాయని మాధవన్ రాజీవన్ వివరించారు. గ్లోబల్ వార్మింగ్‌తో పాటు స్థానిక పర్యావరణ పరిస్థితులు కూడా ఈ మార్పులకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

**వెనక్కి మళ్లుతున్న నైరుతి !**

43 శాతం భూభాగంలో వర్షాభావం..తెలంగాణలో 21 శాతం, ఏపీలో 43 శాతం వర్షపాతం లోటు.. బంగాళాఖాతంలో అల్పపీడనం.. 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం



# తెలంగాణలో అతి భారీ వర్షాలు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రానికి రానున్న మూడు రోజులు భారీ వర్ష సూచన ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తర అండమాన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా ముందుకు వెళుతూ ఆదివారం ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైందని ఐఎండీ(వాతావరణశాఖ) తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా మరింత బలపడి, సోమవారానికి తూర్పు మధ్య బంగాళాఖాతంలోనే వాయుగుండంగా మారనుందని ఐఎండీ పేర్కొంది. మంగళవారానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది.

**రానున్న మూడు రోజులు భారీ వర్షా లు**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 23, 24, 25 తేదీల్లో విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు సహా మొత్తం 13 జిల్లాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. ఇవాళ, రేపు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం నుంచి ఆదివారం వరకు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి.

# పక్కా విధానాలు.. ప్రజా భాగస్వామ్యం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే పక్కా విధానాలు, కార్యాచరణ ఉండాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రభుత్వాలు, న్యాయనిపుణులు, ప్రభావిత వర్గాలు కలిసి పని చేస్తేనే సంక్లిష్ట సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవటం సాధ్యమవుతుందని చెప్పారు. 'జాతీయ హరిత ట్రైబ్యునల్' (ఎన్జీటీ) ఆధ్వర్యంలో 'పర్యావరణం, వాతావరణ మార్పుల'పై జరిగిన రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆమె ప్రసంగించారు. ఆహార భద్రత, ఆరోగ్యం, జీవనోపాధిపై వాతావరణ మార్పులు ఎంతో ప్రభావం చూపిస్తాయని చెప్పారు.

''గ్రామీణులు, అడవుల్లో నివసించే తెగలు, సన్నకారు రైతులు, మహిళలు, ఇతర దుర్బల వర్గాలను చురుగ్గా భాగస్వాముల్ని చేసేలా కార్య వ్యవస్థ ఉండాలి. మానవ మనుగడలో వేర్వేరు స్థాయుల్లో అసమతౌల్యాలకు వాతావరణ మార్పులు కారణమవుతాయి. జీవ వైవిధ్యాన్ని కోల్పోవడం, జల వనరుల క్షీణత, అడవుల క్షీణత వంటివన్నీ దీనితో ముడిపడినవే. మన సంప్రదాయ పద్ధతులు, స్థానిక తెగల అనుభవాలు ఉపయోగించుకుని వాతావరణ మార్పులకు కొంతమేర కళ్లెం వేయవచ్చు. వాటిని బలోపేతం చేసేలా ప్రజలు కేంద్రంగా ముందుకు వెళ్లాలి. అడవుల విస్తీర్ణాన్ని పెంచడం దీనిలో కీలకం. తద్వారా జీవ వైవిధ్యం సాధ్యమవుతుంది. అడవుల పెంపకం అంటే మొక్కలు నాటడం ఒక్కటే కాదు.. ఆరోగ్యకర, సుస్థిర పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం'' అని ముర్ము చెప్పారు.



**మా నాన్న.. భూమికి ప్రణమిల్లేవారు**

''నా చిన్నతనంలో మా నాన్న ప్రతిరోజూ సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి కట్టెలు తెచ్చేవారు. ఎండిన చెట్టును నరకాల్సి వచ్చినా ముందుగా దానికి వినమ్రంగా క్షమాపణ చెప్పేవారు. అలా ఎందుకు చేస్తారని నేనోసారి అడిగాను. పండ్లు, పూలు, గాలి, నీరు వంటివి ఇచ్చిన చెట్టులో భాగమే ఆ కర్రలు అని, కాలంచెల్లి ఎండిపోయినా అవి మనకు ఉపయోగపడుతున్నాయని ఆయన చెప్పారు. భూమిని దున్నేటప్పుడూ ఆయన భూమాతకు ప్రణమిల్లేవారు. భూమివల్లే మనం ఏ ఉత్పత్తులనైనా పొందుతున్నామని చెప్పేవారు. బతుకు.. బతకనివ్వు అనే దానిపై మాకెంతో నమ్మకం'' అని ముర్ము వివరించారు. ఇలాంటి వినమ్రత మన సంస్కృతిలోనే ఉందని చెప్పారు.

# డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు శుభవార్త చెప్పింది. ఎంపికైన దరఖాస్తుదారులకు సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సాప్, ఎస్సెమ్మెస్ ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే టీజీహెచ్‌బీ అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

**రూ.50 లక్షల విలువచేసే ఫ్లాట్ రూ.5 లక్షలకే**

మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకుపైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మించనున్నారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో మార్కెట్లో దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను



కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందించనుంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్, ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని అందిస్తోంది. కాగా రేపు మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

**డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న 26 ప్రాంతాల్లో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు .'డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 30వ తేదీలోపు అత్యవసర ప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా చేపట్టాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలకు 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న వారిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జలమండలి, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ చివరి నాటికి మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి కావాలని ఆదేశించారు.

# బతుకు పోరు...!



మెతుకు కోసం బతుకు పోరాటం...
మూట కోసం మోకాళ్లపై నడిచే
బతుకు...
గూడు కోసం గుండెను గుల్ల చేసే
బతుకు...
గుప్పెడు గంజికై గాయపడే బతుకు...!

*కన్నీటి కడలిలో కలల* *పడవలు...*
*కష్టాల కొలిమిలో కాలుతున్న
జీవితాలు...!*

ఒకడికి ఆకాశమంత ఆస్తి...
ఒకడికి అర్ధపూట అన్నమే అస్తి...
ఒకడికి అధికారపు అహంకారం...
ఒకడికి ఆకలే నిత్య నరకం...!

ఇదేనా సమాజం?
ఇదేనా సమానత్వం?
ఇదేనా నాగరికత?
ఇదేనా మానవత్వం?

రంగుల మయం జీవితం కాదు...
మాట ఒకటి... మది మరొకటి...
ముఖం ఒకటి... మనసు మరొకటి...!

నవ్వుల వెనుక నిశ్శబ్ద రోదనలు...
వెలుగుల వెనుక వెన్నెల లేని రాత్రులు...
ఆర్భాటాల వెనుక ఆరిపోయిన
ఆశలు...!

జీవితం ఒక రంగుల రాట్నం...
తిరుగుతూనే ఉంటుంది కాలచక్రం...
ఎవరి వంతు ఎప్పుడు వస్తుందో
తెలియదు...
ఎవరి వంతు ఎప్పుడు పోతుందో
తెలియదు...!

ధనం దర్పమై...బలం గర్వమై...
అధికారం అహంకారమై...
అన్యాయం ఆనవాయితీ అయింది...!

బీదవాడి బతుకు బరువైంది...
బలహీనుడి గొంతు మూగైంది...
న్యాయం నడక నెమ్మదైంది...
నిజం నడుమనే నలిగిపోయింది...!

చదువుకున్నాం... కానీ చైతన్యం
మరిచాం...
పుస్తకాలు చదివాం... కానీ మనిషిని
చదవలేదు...
డిగ్రీలు తెచ్చాం... కానీ దయను
తెచ్చుకోలేదు...

విజ్ఞానం పెంచాం... కానీ వివేకం
పెంచలేదు...!

సమానత్వం....
అందని ఆకాశమా?
సామరస్యం...
అందని స్వప్నమా?
మానవత్వం....
మాటల్లో మాత్రమే మిగిలిన మంత్రమా?

చావు బతుకుల మధ్య
చలించని హృదయాలెందుకు?
కన్నీటి కడలిమధ్య
కనిపించని కనికరమెందుకు?
మనిషి పక్కనే మనిషి ఉంటూ
మనసుకు మాత్రం మనిషి
దూరమెందుకు?

ప్రశ్నించు మనసా... ప్రశ్నించు!
ప్రతిఘటించు గుండె... ప్రతిఘటించు!
అన్యాయాన్ని అంగీకరించకు...
అవమానాన్ని అలవాటుగా
చేసుకోకు...!

పడిపోతే లేచి నిలువు...
ఓడిపోతే మళ్లీ నడువు...
దారి మూసితే దారిని వెతుకు...
దారే లేకుంటే దారిని సృష్టించు...

బతకడం అంటే ఊపిరి పీల్చడం
కాదు...
బాధల మధ్య భవిష్యత్తును
నిర్మించడం!
బతకడం అంటే కాలంతో కదలడం
కాదు...
కాలాన్నే కదిలించడం!

ఈ బతుకు పోరు ఆగదు...
ఈ అడుగు ఎక్కడా ఆగదు...
చివరి శ్వాస ఉన్నంతవరకు
చివరి ఆశ ఉన్నంతవరకు
చివరి అడుగు పడేంతవరకు

బతుకుతాం... పోరాడుతాం...
పోరాడుతూ బతుకుతాం...!

బతుకు పోరులో అలసిన ఓ అభాగ్య జీవి



**దేశిని శ్రీధర్ గౌడ్**
ఎం.ఏ. ఎం.ఈడి
ప్రిన్సిపాల్, ఎస్.ఆర్ జూనియర్ కళాశాల,
నయీంనగర్,హనుమకొండ





# ఆడ్వాణీ, జైశంకర్‌లకు సర్ నోటీసులు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

భాజపా అగ్ర నేత, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ ఆడ్వాణీకీ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) నోటీసు తప్పలేదు. 2002 ఓటర్ల జాబితాతో ఆయన పేరు మ్యాపింగ్ కావడం లేదంటూ ఎన్నికల అధికారులు ఈ నోటీసు జారీ చేశారు. 98ఏళ్ల ఆడ్వాణీతోపాటు ఆయన కుమార్తె ప్రతిభ, కోడలు గీతికల పేర్లూ దానిలో లేకపోవడంతో ముగ్గురికీ నోటీసులిచ్చారు. ఆయన కుమారుడు జయంత్‌కు మాత్రం ఈ అవసరం రాలేదు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, ఆయన భార్య క్యోకో జైశంకర్‌లకు జారీ అయిన నోటీసులలోనూ మ్యాపింగ్ అంశాన్నే పేర్కొన్నారు. వీరందరూ కొత్తదిల్లీ శాసనసభ నియోజకవర్గ ఓటర్లు. సాక్షాత్తూ కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఎస్.ఎస్.సంధూకు కూడా నోటీసు ఇచ్చారు. ఎన్యూమరేషన్ ఫాంలో ఆయన పేరు డాక్టర్ ఎస్.ఎస్.సంధూ అని, ఓటర్ల జాబితాలో సుఖ్‌బీర్ సింగ్ సంధూ అని ఉండటం దీనికి కారణం! ఆయన సమర్పించిన పత్రాలు పరిశీలించిన తర్వాత ఓటర్ల తుది జాబితాలో పేరు చేరుస్తున్నామని అధికారులు తెలిపారు.